సాక్షి

పార్వతీపురం మన్యం

మంగళవారం । 23 । మే । 2023



ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

ప్రభుత్వ ప్రాధాన్యతా కార్యక్రమాలపై అధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ సూచించారు. - 8లో



బాక్సింగ్ పోటీల్లో పతకాలు

రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు పంచ్ పవర్ చూపించారు. పతకాల పంట పండించారు. - 8లో



సమస్యలు పరిష్కరించాలి

స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని పార్వతీపురంమన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్‌పాటిల్ అధికారులకు సూచించారు. - 8లో

న్యూస్‌రీల్

డీఏహెచ్‌ఓకు ఉద్యోగోన్నతి



డా.ఈశ్వరరావు

పార్వతీపురం: జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డా.ఎ.ఈశ్వరరావుకు జాయింట్ డైరెక్టర్‌గా ఉద్యోగోన్నతి లభించింది. ఈ మేరకు ఆయనను విజయవాడలోని ఏపీ వెటరనరీ కౌన్సిల్‌కు రిజిస్ట్రార్‌గా నియమించినట్టు అధికార వర్గాలు తెలిపాయి. ఆయన ఉద్యోగోన్నతి పొందడంపై జిల్లా అధికారులు అభినందించారు.

ధర్మవరం హైస్కూల్‌లో ఖాళీల భర్తీ



కొత్తగా నియమితులైన పీజీటీలతో మాట్లాడుతున్న హెచ్‌ఎం లక్ష్మి

శృంగవరపుకోట: మండలంలోని ధర్మవరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన ప్లస్ టూ ఫర్ గర్ల్స్‌లో పీజీటీ అధ్యాపకుల భర్తీ పూర్తయింది. అధ్యాపకుల పోస్టులకు వివిధ పాఠశాలలకు చెందిన స్కూల్ అసిస్టెంట్లు దరఖాస్తు చేసుకోగా వారిలో అర్హులను పీజీటీలుగా జిల్లా విద్యాశాఖాధికారులు నియమించారు. విధుల్లో చేరిన పీజీటీలతో హెచ్‌ఎం బి.లక్ష్మి సోమవారం సమావేశమయ్యారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో ప్రప్రథమంగా ధర్మవరం ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో బాలికల కళాశాలను ఏర్పాటుచేసిందన్నారు. బాలికల కోసం ప్రభుత్వం ఏర్పాటుచేసిన కళాశాలను ఉత్తమంగా తీర్చిదిద్దుదామని, నాణ్యమైన విద్యాబోధనతో సత్ఫలితాలు సాధిద్దామన్నారు. బాలికల విద్యకు ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యంను గుర్తించి ముందుకు సాగుదామని చెప్పారు.

ప్రజలకు మెరుగైన వైద్యం



మాట్లాడుతున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురంటౌన్: ప్రజలకు మెరుగైన వైద్యం అందించి, ఆరోగ్య భరోసా కల్పించడమే లక్ష్యంగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని కలెక్టర్ నిషాంత్‌కుమార్ తెలిపారు. రాష్ట్ర వైద్యారోగ్యశాఖ ఆదేశాల మేరకు కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లకు శిక్షణ కార్యక్రమాన్ని జిల్లా ఆస్పత్రి సమావేశ మందిరంలో కలెక్టర్ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అత్యవసర వేళ మెరుగైన వైద్యసేవలు అందించాలన్న ఉద్దేశంతో వైద్యసేవల నైపుణ్యాలపై సీహెచ్‌ఓలకు శిక్షణ ఇస్తున్నట్టు వెల్లడించారు. జిల్లాలోని మారుమూల గిరిజన గ్రామాలు, రవాణా సౌకర్యంలేని గ్రామాల్లో పనిచేసే వారికి శిక్షణ దోహదపడుతుందని, ఆపదవేళ ఆదుకునే అవకాశం కలుగుతుందన్నారు. ప్రథమ చికిత్స, పాము, కుక్క కాటు వ్యాక్సిన్లు వేయడం, గాయాలకు డ్రెస్సింగ్, కుట్లు వేయడం తదితర వైద్యనైపుణ్యాలను సీహెచ్‌ఓలు పెంపొందించుకోవాలన్నారు. జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు మాట్లాడుతూ జిల్లాలో ఉన్న సీహెచ్‌ఓలందరినీ 40 మంది చొప్పున 7 బ్యాచ్‌లుగా విభజించామని, ప్రతి బ్యాచ్‌కు 6 రోజుల పాటు శిక్షణ ఇస్తామని చెప్పారు. ఐదు రోజులు పార్వతీపురం జిల్లా ఆస్పత్రిలోను, ఒక రోజు నెలిమర్ల మిమ్స్‌లో శిక్షణ ఉంటుందన్నారు. సీహెచ్‌ఓలందరూ వారు విధులు నిర్వహిస్తున్న చోటే స్థానికంగా ఉండి, ప్రజలకు వైద్య సేవలందించాలన్నారు. కార్యక్రమంలో మలేరియా ఉప సంచాలకులు ఎ.టి రామనాథం, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ బి.వాగ్దేవి, డీపీఎంఓ ధవళ భాస్కరరావు, డీఐఓ టి.జగన్‌మోహన్‌రావు, డీటీసీఓ శ్యామ్‌కుమార్, డిప్యూటీ డీఎంహెచ్‌ఓ వెంకటరమణ, ప్రోగ్రాం అధికారి డాక్టర్ వినోద్, తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ



ఎస్పీ ఎం.దీపికకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న అదనపు ఎస్పీ అస్మా ఫర్హీన్

విజయనగరం క్రైమ్: జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్)గా అస్మా ఫర్హీన్ జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటికే జిల్లాలో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీగా బాధ్యతలు నిర్వహిస్తున్న ఆమెను రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల అదనపు ఎస్పీ (అడ్మిన్)గా నియమించింది. బాధ్యతలు చేపట్టిన ఆమె ఎస్పీ ఎం.దీపికను జిల్లా పోలీస్ కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసి, పుష్పగుచ్ఛం అందజేశారు. ఫర్హీన్‌ను డీఎస్పీలు పలువురు అభినందించారు.

పనుల జోరు



పాలకొండ జగనన్న లేఅవుట్‌లో జోరందుకున్న ఇళ్ల నిర్మాణాలు

ఇళ్ల నిర్మాణ లబ్ధిదారులకు చెల్లింపులు ఇలా..	
ప్రభుత్వం లబ్ధిదారులకు చెల్లించిన బిల్లులు	రూ.229.78 కోట్లు
నీటి సరఫరాకు ఖర్చు చేసినవి	రూ.3.78 కోట్లు
సిమెంట్	4,55,279 బస్తాలు
స్టీల్	11,51,148.06 కేజీలు
అప్రోచ్ రోడ్లకు	రూ.3.92 కోట్లు

- శరవేగంగా గృహ నిర్మాణ పనులు
- పేదల సొంతింటి కలపై ప్రతిపక్షం బురదజల్లే ప్రయత్నం
- ఇళ్లనిర్మాణ పురోగతిలో రాష్ట్రంలో పార్వతీపురం మన్యం జిల్లా ముందంజ
- ప్రతి శనివారం హౌసింగ్ డే
- జిల్లాలో 21,974 మంది లబ్ధిదారులకు ఇళ్ల పట్టాలు
- లే అవుట్లకు నీటి సరఫరాకు రూ.3.78 కోట్ల ఖర్చు
- లబ్ధిదారులకు 4,55,279 బస్తాల సిమెంట్ అందజేత
- జిల్లాలో 9,882 ఇళ్ల నిర్మాణాలు పూర్తి

పార్వతీపురంటౌన్: వైఎస్సార్ జగనన్న కాలనీల్లో పేదల ఇళ్ల నిర్మాణాలు జోరందుకున్నాయి. వాతావరణం సహకరించడం.. ప్రభుత్వం చకచకా బిల్లులు చెల్లించడం, నిర్మాణ సామగ్రి సమకూర్చడం, మౌలిక సదుపాయాల కల్పనతో ఇళ్ల నిర్మాణాలు శరవేగంగా సాగుతున్నాయి. నవరత్నాలు–పేదలందరికీ ఇళ్లు పథకం కింద జిల్లాలోని నాలుగు నియోజకవర్గాలకు చెందిన 21,974 మంది లబ్ధిదారులకు 485 లేవుట్లలో స్థలాలతో పాటు ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఒక్కో గృహనిర్మాణానికి ప్రభుత్వం రూ.1.80 లక్షల ఆర్థిక సహాయం అందిస్తోంది. పార్వతీపురంలో 11,439, సాలూరులో 9,192, కురుపాంలో 3,013, పాలకొండలో 3,498 గృహ నిర్మాణాలను చేపట్టగా ఇప్పటివరకు జిల్లాలో 9,882 గహ నిర్మాణాలు పూర్తయ్యాయి. దీంతో జిల్లా రాష్ట్రస్థాయిలో ముందంజలో నిలిచింది. పూర్తయిన, వివిధ స్థాయిల్లోని నిర్మాణాల కోసం ప్రభుత్వం లబ్ధిదారులకు రూ.229.78 కోట్ల బిల్లులు చెల్లించింది. ఇప్పటి వరకు లేఅవుట్‌లలో నీటి సరఫరాకు రూ.3.78 కోట్లు ఖర్చు చేసింది. లబ్ధిదారులకు 4,55,279 బస్తాల సిమెంట్, 11,51,148.06 కేజీల ఇనుమును సమకూర్చింది.

ప్రతీ శనివారం హౌసింగ్ డే

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పేదల నిర్మాణాలపై ప్రతి శనివారం హౌసింగ్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తూ క్షేత్రస్థాయి పరిశీలన చేస్తూ పరుగులు పెట్టిస్తున్నారు. గతంలో పేదలకు ఇళ్ల నిర్మాణాలకు సంబంధించి కలెక్టర్ స్థాయిలో తనిఖీలు, పరిశీలనలు అరుదుగా ఉండేవి. అయితే కలెక్టర్ నిషాంత్ కుమార్ ఇళ్ల నిర్మాణాలు, కల్పించిన సౌకర్యాలు, విద్యుత్, నీటి వసతులపై ప్రత్యేకంగా పరిశీలిస్తున్నారు. ఎక్కడికక్కడ లబ్ధిదారులను కలుస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకుని పరిష్కరిస్తున్నారు. కలెక్టర్ తనిఖీలతో గృహనిర్మాణశాఖలో అలసత్వం ప్రదర్శిస్తున్న అధికారుల్లో కదలిక వచ్చింది.



హౌసింగ్ డే కార్యక్రమంలో క్షేత్రస్థాయి పరిశీలనలో కలెక్టర్ నిషాంత్‌కుమార్, హౌసింగ్ అధికారులు (ఫైల్)

గత పాలనకు భిన్నంగా..

గత ప్రభుత్వ పాలనకు పూర్తి భిన్నంగా ప్రస్తుత ప్రభుత్వం ఇళ్ల లబ్ధిదారులకు సహకారం అందిస్తోంది. టీడీపీ ప్రభుత్వంలో ఇంటి నిర్మాణం కోసం రూ.1.50 లక్షలు చెల్లించినా అది రుణంగా తిరిగి చెల్లించాల్సి వచ్చేది. సిమెంట్ మాత్రమే సరఫరా చేసేది. ప్రస్తుతం ఒక్కో ఇంటికి ప్రభుత్వం రూ.1.80 లక్షలు చెల్లిస్తోంది. ఈ సొమ్మును తిరిగి రుణంగా చెల్లించాల్సిన అవసరం లేదు. దీనికితోడు సిమెంట్, ఇనుప కమ్మీ, తలుపులు, కిటికీలను తక్కువ ధరకే అందిస్తోంది. గత ప్రభుత్వంలో పేదలకు ఇళ్లస్థలాలు చూపి చేతులు దులుపుకునే వారు. ఇప్పుడా పరిస్థితి లేదు. ప్రభుత్వం ఇళ్ల నిర్మాణాల కోసం బోర్లు, విద్యుత్ సౌకర్యం కల్పించింది. ప్రధానంగా బిల్లుల చెల్లింపు సకాలంలో చేస్తోంది. పెండింగ్ మాట లేకుండా లబ్ధిదారుల ఇంటి నిర్మాణస్థాయినిబట్టి బిల్లుల నగదును వారి ఖాతాలకు జమ చేస్తోంది. ప్రభుత్వ చర్యలతో నిర్మాణ పనులు వేగంగా సాగుతున్నాయి.

పార్వతీపురం మన్యం జిల్లాలో మండలాల వారీగా ఇళ్ల లబ్ధిదారుల సంఖ్య ఇలా	
మండలం	లబ్ధిదారుల సంఖ్య
కొమరాడ	2004
గరుగుబిల్లి	541
కురుపాం	179
జియ్యమ్మవలస	289
బలిజిపేట	3,253
పార్వతీపురం	2,623
పార్వతీపురం అర్బన్	2,903
సీతానగరం	2,660
మక్కువ	1922
పాచిపెంట	1587
సాలూరు	2,387
సాలూరు అర్బన్	3,296
పాలకొండ అర్బన్	1896
పాలకొండ	479
భామిని	328
వీరఘట్టం	795

లక్ష్యాలు సాధిస్తున్నాం



జిల్లాలో జగనన్న లేఅవుట్లలో నిర్మాణాలు వేగవంతం చేశాం. లక్ష్యం సాధించే దిశగా ముందుకు సాగుతున్నాం. ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నాం. ఇళ్ల నిర్మాణాలకు ఇబ్బందులు లేకుండా చూస్తున్నాం. ప్రతి శనివారం హౌసింగ్ డే నిర్వహిస్తూ, సమీక్షిస్తూ నిర్మాణ పనుల్లో వేగం పెంచుతున్నాం.

– నిషాంత్‌కుమార్, కలెక్టర్, పార్వతీపురం మన్యం

వలంటీర్లే జగనన్న సైన్యం



అవార్డులు పొందిన వలంటీర్లతో డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర, ప్రజాప్రతినిధులు, నాయకులు

- డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: ప్రభుత్వానికి–ప్రజలకు మధ్య వారధులు, సారథులుగా పనిచేస్తున్న వలంటీర్లే సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నిజమైన సేవా సైన్యమని ఉపముఖ్యమంత్రి, గిరిజన సంక్షేమ శాఖమంత్రి పీడిక రాజన్నదొర అన్నారు. మండలంలో మామిడిపల్లి గ్రామంలో మామిడిపల్లి, తోణాం, మరిపల్లి, కందులపదం, తోణాం సచివాలయాల పరిధిలోని వలంటీర్లను ఎంపీడీఓ పార్వతి ఆధ్వర్యంలో సోమవారం సత్కరించారు. సేవావజ్ర, సేవారత్న, సేవామిత్ర అవార్డులు ప్రదానం చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వలంటీర్లకు వందనం అనే పదం చాలా గొప్పదన్నారు. అంతటి స్థాయిని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్లకు అందించారని తెలిపారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా, అర్హతే ప్రామాణికంగా, అత్యంత పారదర్శకంగా, అవినీతిరహితంగా సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వలంటీర్ల పాత్ర కీలకమని వివరించారు. ఇటువంటి గొప్ప వ్యవస్థను ఢిల్లీ, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో అమలు చేయాలని అక్కడ ముఖ్యమంత్రులు ఆలోచనలు చేస్తున్నారని, విదేశాల్లోనూ ఈ వ్యవస్థకు మంచిపేరు వచ్చిందని వివరించారు. జగనన్న సైన్యమైన వలంటీర్లు అందిస్తున్న పారదర్శక సేవలతో ప్రభుత్వానికి మంచి పేరువస్తుండడంతో టీడీపీ, ప్రతిపక్షాలు ఓర్వలేక పోతున్నాయన్నారు. దేశంలోనే అత్యధిక పింఛన్లు అందిస్తున్న ఏకైక రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌గా పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయాల చైర్‌పర్సన్ రెడ్డి పద్మావతి, ఏఎమ్‌జీ చైర్‌పర్సన్ దండి అనంతకుమారి, వైస్ ఎంపీపీలు రెడ్డి సురేష్, సువ్వాడ గుణవతమ్మ, నాయకులు దండి శ్రీనివాసరావు, సువ్వాడ రామకృష్ణ, భరత్‌శ్రీనివాస్, ముచ్చల ఆదయ్య, వంతల ఎండమ్మ, ముగడపెంటమ్మ, జన్ని సీతారాం, తాడంగి కన్నమ్మ, పెద్దింటి మాధవ, కన్నంనాయుడు తదితరులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారమే లక్ష్యం

- గ్రామ, మండల స్థాయిలో చక్కని పరిష్కారం చూపాలి
- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: ప్రజల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో పనిచేయాలని, సాధ్యమైనంత వరకు గ్రామ సచివాలయం, మండల స్థాయిలోనే పరిష్కరించాలని కలెక్టర్ నిషాంత్‌కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమంలో ఇన్‌చార్జి జేసీ సి.విష్ణుచరణ్, జిల్లా రెవెన్యూ అధికారి జె.వెంకటరావుతో కలిసి అర్జీదారుల నుంచి 94 వినతులు స్వీకరించారు. వినతులలో కొన్ని ఇలా...

- సాలూరు పట్టణం 8వ సచివాలయ పరిధిలో సర్వే నంబర్ 216/2 లో ఆక్రమణకు గురైన 0.70 సెంట్ల భూమిని స్వాధీనం చేసుకొని గిరిజనులకు ఇళ్లపట్టాలు మంజూరుచేయాలని సాలూరు మున్సిపాలిటీ 14 వార్డు కౌన్సిలర్ పాలవలస మధుసూదనవు కలెక్టర్‌కు విన్నవించారు.
- ఏనుగులను అడవిలోకి మళ్లించి ప్రజల ఆస్తులు, రైతుల పంటలకు రక్షణ కల్పించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రెడ్డి వేణు కోరారు.
- సీతంపేట మండలం ఎగువధార బంధం గ్రామం రోడ్డు పనులు పూర్తిచేయాలని సర్పంచ్ వి.రమ, గ్రామస్తులు విన్నవించారు.
- టీకరఖండి నుంచి బర్లకోట వరకు మంజూరైన రోడ్డు పనులు ప్రారంభించాలని కురుపాం మండలం బర్లకోట గ్రామానికి చెందిన ఆరిక భారతమ్మ వినతిపత్రం అందజేశారు.
- గరుగుబిల్లి మండలం గొట్టివలస గ్రామ రెవెన్యూలో సాగుచేస్తున్న కొండపోడుకు పట్టాలు ఇవ్వాలని పప్పల సూర్యనారాయణ కోరారు.
- పార్వతీపురం నుంచి కూనేరు వరకు మూడు రాష్ట్రాలకు వెళ్లే అంతర్ రాష్ట్ర రహదారిపై గోతులను పూడ్చాలని కొల్లి సాంబమూర్తి విజ్ఞప్తిచేశారు. స్పందనలో జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ కె.రామచంద్రరావు, డీఆర్‌డీఏ ప్రాజెక్టు డైరెక్టర్ పి.కిరణ్‌కుమార్, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ.ప్రభాకరరావు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎండీనాయక్, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఖోఖో విజేత విజయనగరం



బాలికల ఖోఖో పోటీల్లో విజేతగా నిలిచిన విజయనగరం బాలికల జట్టు

- బాల, బాలికల విభాగాల్లో సత్తా చాటిన విజయనగరం జట్లు
- ముగిసిన రాష్ట్ర స్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ పోటీలు
- విజేతలకు బహుమతులు ప్రదానం చేసిన డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి

విజయనగరం: రాష్ట్రస్థాయి అండర్–19 స్కూల్ గేమ్స్ ఖోఖో పోటీల్లో ఆతిథ్య విజయనగరం జట్టు విజేతగా నిలిచింది. గత రెండు రోజులుగా నగరంలోని కస్పా కార్పొరేషన్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో నిర్వహించిన అంతర్ జిల్లాల బాల, బాలికల ఖోఖో పోటీల్లో విజయనగరం జిల్లా జట్లు ప్రథమ స్థానం కైవసం చేసుకున్నాయి. పోటీల్లో బాలికల విభాగంలో విజయనగరం జట్టు ప్రథమ స్థానం చేజిక్కించుకోగా, తూ.గో జిల్లా జట్టు ద్వితీయ స్థానం, విశాఖ జట్టు తృతీయ స్థానాల్లో నిలిచాయి. బాలుర విభాగంలో విజయనగరం జట్టు ప్రథమ స్థానంలో నిలవగా, ప్రకాశం ద్వితీయ, విశాఖ జిల్లా జట్టు తృతీయ స్థానాలను సొంతం చేసుకున్నాయి. విజేతలకు విజయనగరం కార్పొరేషన్ డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి, సెట్విజ్ సీఈఓ బి.రామ్ గోపాల్, జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్షుడు పి.చిన్నంనాయుడు, కార్యదర్శి సత్యనారాయణ, డీవీఈఓ కె.సురేష్‌కుమార్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ విజయనగరం వేదికగా గత మూడు రోజులుగా జరిగిన అండర్ –19 స్కూల్ గేమ్స్ కబడ్డీ, ఖోఖో పోటీల్లో ఆతిథ్య విజయనగరం జట్లు ప్రతిభ కనబరచడం ఆనందంగా ఉందన్నారు. పోటీల్లో ప్రతిభ కనబరిచిన వివిధ జిల్లాల క్రీడాకారులకు అభినందనలు తెలిపారు. ఢిల్లీలో జరగబోయే జాతీయ పోటీలకు ఎంపికైన క్రీడాకారులు విజేతలుగా నిలిచి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కీర్తిప్రతిష్టను ఇనుమడింపజేయాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అండర్–19 స్కూల్‌గేమ్స్ కార్యదర్శి పీవీఎల్ కృష్ణ, మాజీ కార్యదర్శి బొమ్మన రామారావు, పోటీలో రాష్ట్ర పరిశీలకుడు పట్టభిరామ్, అండర్–17 స్కూల్ గేమ్స్ కార్యదర్శి ఎల్.వి.రమణ, జిల్లా కబడ్డీ అసోసియేషన్ ఆర్గనైజింగ్ కార్యదర్శి పతివాడ శ్రీనివాసరావు, వ్యాయామ ఉపాధ్యాయులు కె.గోపాల్, సత్యనారాయణ, సీనియర్ క్రీడాకారుడు హరీష్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.



బాలుర విభాగంలో విజేతగా నిలిచిన విజయనగరం జట్టు

టీడీపీ నాయకుడి భూ దందా

- రూ.25 లక్షల విలువ గల భూమి కబ్జా యత్నం
- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో రెవెన్యూ రికార్డులు తారుమారు చేసిన వైనం
- వీరఘట్టం మండలం తూడిలో చేతులు మారిన 1.12 ఎకరాలు
- లబోదిబోమంటున్న అసలైన హక్కుదారు



టీడీపీ నాయకుడు కబ్జాకు యత్నిస్తున్న యెన్ను సన్యాసమ్మ సాగులో ఉన్న 1.12 ఎకరాల భూమి ఇదే (ఫైల్)

వీరఘట్టం: వీరఘట్టం మండలం తూడి గ్రామంలో ఓ మహిళకు వారసత్వంగా వచ్చిన భూమిపై ఓ టీడీపీ నాయకుడు కన్నేశాడు. ఎలాగైనా ఆ భూమిని సొంతం చేసుకోవాలనే తపనతో తన పేరుమీద తప్పుడు రికార్డులు సృష్టించి భూ ఆక్రమణకు తెరతీశాడు. వాస్తవానికి ఈ భూమిని ఆమె నేటికీ సాగుచేస్తున్నప్పటికీ హక్కు పత్రాలు మాత్రం తన పేరు మీద సృష్టించాడు. దీనికి రెవెన్యూశాఖలో వీఆర్వోగా పనిచేస్తున్న అతని తమ్ముడు సహకారం తోడవ్వడంతో సదరు మహిళకు చెందిన రూ.25 లక్షల విలువైన 1.12 ఎకరాల భూమి రికార్డుల నుంచి మాయమైంది. ఈ విషయాన్ని ఎన్నిసార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా మేమేమీ చేయలేమనే పరిస్థితి నెలకొనడంతో తన భూమి పరాధీనం అవుతుండడంపై బాధిత మహిళ లబోదిబోమంటోంది. వివరాల్లోకి వెళ్తే...

వీరఘట్టం మండలం తలవరం గ్రామానికి చెందిన యెన్ను సన్యాసమ్మకు వారసత్వంగా ఇదే మండలంలోని తూడి గ్రామంలో సర్వే నంబర్ 285/2ఎలో 1.12 ఎకరాలు, 287/4 లో 1.39 ఎకరాల భూమితో కలిపి మొత్తం 2.51 ఎకరాల భూమి ఉంది. 1973 జూన్ 26న పాలకొండ సబ్ రిజిస్ట్రార్ వారి కార్యాలయం ద్వారా డాక్యుమెంట్ నంబర్ 1474 ద్వారా ఈ భూమి సన్యాసమ్మకు దఖలు పడింది. అప్పటి నుంచి ఈ భూమిని ఆమె తన కుమారులతో కలిసి సాగుచేస్తోంది. కొందరు వ్యక్తులు వీరిపై కక్షతో పంటకు నష్టం కలిగించడంతో ఆమె పాలకొండ సివిల్ కోర్టులో కేసువేశారు. పాలకొండ కోర్టు 2018 ఏప్రిల్ 11న ఆమెకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది. అయితే కొందరు తూడి గ్రామానికి చెందిన వ్యక్తులు ఆమెకు వ్యతిరేకంగా రాజాం కోర్టులో దావా వేశారు.

ఇదీ జరిగిన విషయం...

భూ సమస్య రాజాం కోర్టుకు వెళ్లింది. అంతకముందే పాలకొండ కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇవ్వడంతో సాగు చేస్తున్న భూమిని తన పేరుతో రికార్డుల్లోకి ఎక్కించి సాగు హక్కు కల్పించాలని యెన్ను సన్యాసమ్మ వీరఘట్టం మండల రెవెన్యూ అధికారులకు పలుమార్లు మొరపెట్టుకుంది. అయితే ఈ భూ వివాదం రాజాం కోర్టులో ఉన్నందున, మీరు సాగుచేస్తున్నప్పటికీ మీ పేరును రికార్డుల్లో నమోదు చేయలేమని అప్పటి రెవెన్యూ అధికారులు సన్యాసమ్మకు చెప్పేశారు. అయితే, రాజాం కోర్టులో కేసు వేసిన ప్రతివాదుల్లో ఒకరైన ఖండాపు వెంకటరమణ (టీడీపీ నాయకుడు, శ్రీకాకుళం జిల్లా మాజీ జెట్పీ వైస్ చైర్మన్ ఖండాపు జ్యోతి భర్త) సర్వే నంబర్ 285/2ఎలో ఉన్న 1.12 ఎకరాల భూమిని తనపేరు మీద తప్పుడు పత్రాలతో రాయించుకున్నాడు. అంతే కాకుండా మరో సర్వే నంబర్ 287/4లో ఉన్న 1.39 ఎకరాల భూమికి రికార్డులు లేకుండా చేసినట్టు సమాచారం.

కోర్టు పరిధిలో ఉన్న భూమి ఎలా మార్చేసారు...

వాస్తవానికి సర్వే నంబర్ 285/2 ఎలో ఉన్న 1.12 ఎకరాలు, సర్వే నంబర్ 287/4లో ఉన్న 1.39 ఎకరాల భూమి తగాదా కోర్టులో ఉండగా ఈ భూమి రెవెన్యూ రికార్డుల్లో లేకుండా తారుమారు చేసేశారు. టీడీపీ నాయకుడు ఖండాపు వెంకటరమణ తమ్ముడు అప్పటిలో ఇక్కడ వీఆర్వోగా పనిచేశారు. తన అన్నకు ఉన్న పలుకుబడితో రికార్డులు తారుమారు చేసి ఒక మహిళ భూమిని తన అన్న పేరుమీద తప్పుడు రికార్డులు సృష్టించగా అప్పటిలో పనిచేసిన కొందరు రెవెన్యూ అధికారులు సహకారం అందించడంతోనే ఈ రికార్డులు తారుమారు అయ్యాయని బాధిత మహిళ ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా తన భూమిని ఇప్పించి, తప్పుడు రికార్డులు సృష్టించిన వారిపైన, అందుకు సహకరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని బాధిత మహిళ కోరుతోంది.

భూమికి హక్కు కల్పించండి



తూడి గ్రామంలో సర్వే నంబర్ 285/2ఎ లో ఉన్న నాపేరు మీద ఉన్న 1.12 ఎకరాల భూమిని ఇదే గ్రామానికి చెందిన ఖండాపు వెంకటరమణ తప్పుడు ధ్రువపత్రాలతో రాయించుకున్నాడు. ఆయనకు ఈ భూమిని ఏ ప్రాతిపదిక మీద రాయించారో అధికారులు సమాధానం చెప్పాలి. అలాగే, 287/4 లో ఉన్న భూమిని రికార్డుల్లో లేకుండా తారుమారు చేసిన వారిపై కూడా ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలి. నా ఆధీనంలో సాగులో ఉన్న ఈ భూమికి హక్కు పత్రాలు ఇప్పించాలి.

– యెన్ను సన్యాసమ్మ, బాధిత మహిళ

సబ్ కలెక్టర్ పరిధిలో ఉంది

ప్రస్తుతం ఈ భూ తగాదా పాలకొండ సబ్ కలెక్టర్ పరిధిలో ఉంది. ఇప్పటికే రెండు పార్టీలకు చెందిన వారితో సబ్ కలెక్టర్ మాట్లాడారు. కొద్ది రోజుల్లో ఈ సమస్య ఓ కొలిక్కి వస్తుంది.

– చందక సత్యనారాయణ, తహసీల్దార్, వీరఘట్టం

క్లుప్తంగా

గిరిశిఖర గర్భిణుల వసతి గృహం సందర్శన



గర్భిణులకు మిఠాయిలు పంచిపెడుతున్న బాలల హక్కుల కమిషన్ చైర్మన్ కేసలి అప్పారావు

సాలూరు: పట్టణంలోని వైటీసీలో గల గిరిశిఖర గర్భిణుల వసతిగృహాన్ని బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ రాష్ట్ర చైర్మన్ కేసలి అప్పారావు సోమవారి సందర్శించారు. ఈ మేరకు సోమవారం వైటీసీకి వచ్చిన ఆయన వసతిగృహంలో గర్భిణులతో మాట్లాడారు. వారికి అందిస్తున్న పౌష్టికాహారం, వైద్యారోగ్య సేవలు తదితర అంశాలపై ఆరాతీశారు. ఏమైనా సమస్యలున్నాయా అని అడిగి తెలుసుకున్నారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో డీసీపీఓ సత్యనారాయణ, సీడ్ డైరెక్టర్ వేణుగోపాలరావు, సీడీపీఓలు తదితరులు పాల్గొన్నారు.

సచివాలయ ఉద్యోగుల సంఘానికి నూతన కార్యవర్గం



ఎన్నికైన నూతన కార్యవర్గం

పార్వతీపురం టౌన్: పార్వతీపురం మన్యం జిల్లా గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల సంఘం జిల్లా నూతన కార్యవర్గాన్ని సోమవారం ఎనుకున్నారు. కార్యవర్గం రాష్ట్ర అధ్యక్షుడు శంకర్రావు, కార్యదర్శి సింహాచలం, ఆర్గనైజింగ్ కార్యదర్శి భరత్ భూషణ్‌ల ఆధ్వర్యంలో ఎన్నిక జరిగింది. ఈ మేరకు నూతన కార్యవర్గం జిల్లా అధ్యక్షుడిగా కొండగొర్రి చిరంజీవులు, జిల్లా ఉపాధ్యక్షుడిగా కె.మనోజ్, ప్రధాన కార్యదర్శిగా ఆరిక రంగారావు, ఆర్గనైజింగ్ కార్యదర్శిగా పి. శివకుమార్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా చంద్రరావు, జాయింట్ సెక్రటరీగా ఎ. రమేష్, ట్రెజరర్‌గా ఎస్.బాబూరావు, మెంబర్లుగా తోటయ్య, ఎన్ రాంబాబు, బి.జగదీష్, ఎ.కుమార్ ఎన్నికయ్యారు.

రామనారాయణంలో ఉచిత ఆర్చరీ శిక్షణ



ఆర్చరీ శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న దృశ్యం

విజయనగరం రూరల్: ప్రముఖ ఆధ్యాత్మిక, పర్యాటక కేంద్రం రామనారాయణంలో ఉచిత ఆర్చరీ శిక్షణ తరగతులను ధనుర్విద్య జిల్లా శిక్షకుడు గాంధీ సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎన్‌సీఎస్ ట్రస్టీ నారాయణం శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా రామనారాయణం ప్రాంగణంలో వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తామని, అందులో భాగంగా వేసవి శిక్షణ తరగతులను ప్రతిరోజూ ఉదయం 6 గంటల నుంచి 7.30 గంటల వరకు, సాయంత్రం 5 గంటల నుంచి 6.30 గంటల వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆసక్తి ఉన్న విద్యార్థులు ఈ శిక్షణ తరగతుల్లో పాల్గొనాలని కోరారు.

ఎంఆర్‌పీఎస్ సభ విజయవంతం చేయండి

- ఎంఆర్‌పీఎస్ కోస్తా, ఉత్తరాంధ్ర ఇన్‌చార్జి సుబ్బారావు



సమావేశంలో మాట్లాడుతున్న సుబ్బారావు

విజయనగరం ఫోర్ట్: ఈనెల 29న ఎంఆర్‌పీఎస్ నాయకుడు మంద కృష్ణ మాదిగ జిల్లాకు వస్తున్న సందర్భంగా నిర్వహించే సభను విజయవంతం చేయాలని ఎంఆర్‌పీఎస్ కోస్తా, ఉత్తరాంధ్ర జిల్లాల ఇన్‌చార్జి సుబ్బారావు కోరారు. ఈ మేరకు స్థానిక అంబేడ్కర్ కూడలిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈసభకు ఎంఆర్‌పీఎస్ నాయకులు, కార్యకర్తలు హాజరుకావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బోగి శ్రీనుమాదిగ, పెంకి సుధాకర్, సురగాల లక్ష్మణ్, అరసాడ బాలరాజు, మారిశెట్టి ఆనందరావు, రామారావు తదితరులు పాల్గొన్నారు.

కోడిగుడ్ల ధరలు

హోల్‌సేల్ ధరలు	(100 గుడ్లు)
విశాఖపట్నం	రూ. 495.00
విజయనగరం	రూ. 499.00
శ్రీకాకుళం	రూ. 499.00

బులియన్

విశాఖపట్నం	
బంగారం(24సి. 10గ్రా.)	61,420-00
బంగారం(22సి. 10గ్రా.)	56,300-00
వెండి (కిలో)	78,600-00

చికెన్

బ్రాయిలర్

లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹142	₹254	₹ 264

ప్రభుత్వ ప్రాధాన్య కార్యక్రమాలపై ప్రత్యేక దృష్టి

- వీడియో కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ నాగలక్ష్మి



విజయనగరం ఫోర్ట్: వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ నాగలక్ష్మి



వీడియోకాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

విజయనగరం ఫోర్ట్: ఫిర్యాదుదారులు శతశాతం సంతృప్తి చెందేలా 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమాన్ని నిర్వహించాలని కలెక్టర్ నాగలక్ష్మి అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యం ఇస్తున్న ఈ కార్యక్రమంపై మండల, జిల్లా స్థాయి అధికారులంతా ప్రత్యేకదృష్టి పెట్టాలని ఆదేశించారు. ఈ మేరకు మండల ప్రత్యేకాధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీఓలు, ఎంఈఓలు, మండల ఇంజినీరింగ్ అధికారులతో కలెక్టరేట్ నుంచి సోమవారం ఆమె వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా నాడు-నేడు గడపగడపకు మన ప్రభుత్వం, ప్రభుత్వ ప్రాధాన్యతా భవనాల నిర్మాణాలపై మండలాల వారీగా సమీక్షించారు. స్పందన ఫిర్యాదుదారులను శతశాతం సంతృప్తి పరిచే బాధ్యత మండల స్థాయిలో ఎంపీడీఓలు, తహసీల్దార్లపైనే ఉందని స్పష్టం చేశారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కార్యక్రమాన్ని ప్రభుత్వం ఇటీవలే ప్రారంభించిందని, దీనిపై ప్రజలకు మరింత అవగాహన కల్పించాలని కలెక్టర్ సూచించారు. వైద్యులు గ్రామాలకు వెళ్లే షెడ్యూల్‌ను ముందుగానే ప్రకటించాలని, సంబంధిత సచివాలయంలో, ఇతర చోట్ల షెడ్యూల్ ఉంచాలని సూచించారు. వైద్యులు గ్రామాలకు సకాలంలో వస్తున్నదీ లేనిదీ గమనించాలని చెప్పారు. నాడు- నేడు గడప, గడపకు మన ప్రభుత్వం , ప్రభుత్వ పాధాన్యతా భవనాల నిర్మాణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ మయూర్ ఆశోక్, డీఆర్‌ఓ గణపతిరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతిపాదనలు సకాలంలో పంపించాలి

పార్వతీపురం: పార్వతీపురం మన్యం జిల్లాలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పనులకు సంబంధించిన ప్రతిపాదనలు అధికారులు సకాలంలో పంపించాలని కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన జిల్లాలో అభివృద్ధిపనుల పురోగతిపై సోమవారం మండల అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గడపగడపకు మన ప్రభుత్వం పనులకు సంబంధించి సకాలంలో ప్రతిపాదనలు పంపించకపోవడం కారణంగా జిల్లాకు నిధులు తగ్గి పోతున్నాయని, తద్వారా జిల్లా ప్రగతి కుంటుపడుతుందన్నారు. ఇళ్ల నిర్మాణానికి సంబంధించి శతశాతం పనులను గ్రౌండింగ్ చేయాలని కోరారు. ఇంటి నిర్మాణానికి అవసరమైన ఇనుము, సిమెంట్ సబ్సిడీ ధరలకు ప్రభుత్వం లబ్ధిదారులకు అందిస్తోందని, అవి లబ్ధిదారులకు అందేవిధంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఉపాధిహామీ పథకం పనుల్లో కూలీల హాజరులో కొన్ని మండలాల్లో తేడాలు వస్తున్నాయని, కూలీల హాజరును సక్రమంగా నమోదు చేయకపోతే వారు నష్టపోవాల్సి వస్తుందన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో ఇన్‌చార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డీఆర్‌ఓ జె.వెంకటరావు, పీఆర్ ఇంజినీరింగ్ అధికారి ఎంవీఆర్.కృష్ణాజీ, డ్వామా పీడీ కె.రామచంద్రరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ప్రభాకరరావు, డీపీఓ బి.సత్యనారాయణ, డీఈఓ ప్రేమ్‌కుమార్ తదితరులున్నారు.

గడువులోగా సమస్యలు పరిష్కరించాలి

- ఎస్పీ విక్రాంత్ పాటిల్



పార్వతీపురం టౌన్: అర్జీదారులతో మాట్లాడుతున్న ఎస్పీ విక్రాంత్ పాటిల్



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ ఎం.దీపిక

పార్వతీపురంటౌన్: స్పందన ఫిర్యాదులను నిర్దిష్ట గడువులోగా పరిష్కరించాలని పార్వతీపురం మన్యం జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో భాగంగా ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లా పోలీసు కార్యాలయంలో ప్రతి వారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజలు వారి సమస్యలపై స్వేచ్ఛగా విన్నవించుకోవచ్చునని, వాటిపై చట్టపరిధిలో విచారణ చేపట్టి నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామన్నారు. పోలీసు అధికారులు వారి పరిధిలో గల సమస్యలను పరిష్కరించి వాటికి సంబంధించిన నివేదికలను అందజేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఒ.దిలీప్‌కిరణ్, దిశ డీఎస్పీ ఎస్ఆర్ హరిత, ఏఆర్‌డీఎస్పీ బి.నాగేశ్వరరావు, ఎస్బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ ఇన్‌స్పెక్టర్ ఎస్‌వీ ప్రభాకర్, ఎస్సై పి.దినకర్ తదితరులు పాల్గొన్నారు.

స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు

విజయనగరం క్రైమ్: స్పందన ఫిర్యాదులపై తక్షణ చర్యలు చేపట్టాలని విజయనగరం జిల్లా ఎస్పీ ఎం.దీపిక అధికారులను ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ఆమె స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సామాన్య ప్రజల నుంచి ఫిర్యాదులను స్వీకరించి, సమస్యలను అడిగి తెలుసుకుని, సంబంధిత పోలీసు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడి, వాటిని పరిష్కరించేందుకు చర్యలు చేపట్టి, ఫిర్యాదుదారులకు చట్టపరిధిలో న్యాయం చేయాలని ఆదేశించారు. స్పందన కార్యక్రమంలో 37 ఫిర్యాదులను స్వీకరించిన ఆమె వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో ఎస్సీ ఎస్టీ సెల్ డీఎస్పీ ఆర్.శ్రీనివాసరావు, ఎస్బీ సీఐలు జి.రాంబాబు, ఇ.నరసింహమూర్తి, పోలీసు అధికారులు పాల్గొన్నారు.

టీడీపీ పాలనలో ప్రభుత్వ ఆస్తుల లూటీ

- సాక్ష్యాలతో చర్చకు సిద్ధం
- రాష్ట్ర వెలమ కార్పొరేషన్ ఛైర్మన్ నెక్కలి నాయుడుబాబు



టీడీపీ పాలనలో అందజేసిన 56 గజాల స్థలం పట్టా చూపుతున్న రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు తదితరులు

కొత్తవలస: తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో ఆ పార్టీ నాయకులు ప్రభుత్వ ఆస్తులను లూటీ చేశారని, పంచ భూతాలను సైతం అమ్ముకుని ఆస్తులు కూడబెట్టుకున్నారని రాష్ట్ర వెలమ కార్పొరేషన్ చైర్మన్ నెక్కలి నాయుడుబాబు ధ్వజమెత్తారు. ఈ మేరకు మండల కేంద్రంలో గల ఆయన క్యాంప్ కార్యాలయంలో స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ టీడీపీ పాలనలో ప్రభుత్వ ఆస్తులను ఆపార్టీ నాయకులు దోచుకున్నారని ఆరోపించారు. మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి టీడీపీ పాలన చివరి రోజుల్లో ఎన్నికల్లో ఓట్లను ఆర్జించే ఉద్దేశంతో హడావడిగా సుమారు 6వందల బోగస్ ఇళ్ల పట్టాలను పేదలకు అందజేసి నిలువునా మోసం చేశారని ఆరోపించారు. ఈనెల 18వ తేదీన టీడీపీ అధినేత చంద్రబాబు ఎస్.కోటలో నిర్వహించిన సభలో జగన్‌మోన్ రెడ్డి ప్రభుత్వం పేదలకు సెంటున్నర(73 గజాలు స్థలం) ఇస్తోందని, ఆ స్థలం ఇల్లు కట్టుకునేందు కన్నా సమాధి కట్టుకునేందుకు ఉపయోగ పడుతుందని అనుచిత వ్యాఖ్యలు చేశారన్నారు. కాగా ఆయన పాలనలో ఆదే పేదలకు కేవలం 56 గజాల స్థలాన్నే ఇంటి పట్టాగా అందజేశారని గుర్తు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ, వైఎస్ ఎంపీపీలు నీలంశెట్టి గోపెమ్మ, కర్రి శ్రీను, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు ఒబ్బిన నాయుడు, పీఏసీఎస్ అధ్యక్షుడు గొరపల్లి శివ, పార్టీ నాయుకులు మేలాస్త్రీ అప్పారావు, గొరపల్లి రవికుమార్, విరోతి కొండలరావు, పలు గ్రామాల సర్పంచ్‌లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి బాక్సింగ్ పోటీల్లో పతకాలు

- జాతీయ పోటీలకు ఇద్దరు జిల్లా క్రీడాకారుల ఎంపిక



బాక్సింగ్ పోటీల్లో సాధించిన పతకాలతో జిల్లా క్రీడాకారులు

విజయనగరం: రాష్ట్రస్థాయిలో జరిగిన బాక్సింగ్ పోటీల్లో జిల్లా నుంచి ప్రాతినిధ్యం వహించిన క్రీడాకారులు పంచ్ పవర్ చూపించారు. విశాఖపట్నం వేదికగా జరిగిన యూత్ మెన్స్ బాక్సింగ్ చాంపియన్‌షిప్ పోటీల్లో 13 విభాగాల్లో పోటీ పడిన జిల్లా బాక్సర్‌లు 8 విభాగాల్లో పతకాలు సాధించి ఓవరాల్ చాంపియన్‌షిప్ కైవసం చేసుకున్నారు. ఈ పోటీల్లో 80-86 కేజీల విభాగంలో తలపడిన పి.దేవ కుమార్ , 86-92 కేజీల విభాగంలో ఆడిన బి.చంద్రశేఖర్‌లు బంగారుపతకాలు సాధించగా..46-48 కేజీల విభాగంలో ఎస్.తేజశ్వర్, 70-78 కేజీల విభాగంలో ఎస్.మోహనరావులు వెండి పతకాలు కైవసం చేసుకున్నారు. అలాగే 51-54 కేజీల విభాగంలో సీహెచ్ చంద్రశేఖర్, 54-56 కేజీల విభాగంలో జె.వసంత్, 57-60 కేజీల విభాగంలో కె.రవితేజ, 66-70 కేజీల విభాగంలో బి.మనోజ్‌లు కాంస్య పతకాలు దక్కించుకున్నారు. రాష్ట్రస్థాయి పోటీల్లో బంగారు పతకాలు దక్కించుకున్న పి.దేవ కుమార్, బి.చంద్రశేఖర్‌లు త్వరలో సిక్కిం రాష్ట్రంలో జరగనున్న మెన్స్ యూత్ బాక్సింగ్ నేషనల్ చాంపియన్‌షిప్ పోటీలకు రాష్ట్ర జట్టు తరఫున ఎంపికైనట్లు ఆంధ్రప్రదేశ్ బాక్సింగ్ అసోసియేషన్ ఉపాధ్యక్షుడు డోలా మన్మథకుమార్ తెలిపారు. రాష్ట్రస్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన క్రీడాకారులతో పాటు జాతీయ పోటీలకు అర్హత సాధించిన క్రీడాకారులను సోమవారం ఆయన అభినందించారు. కార్యక్రమంలో శాప్ బాక్సింగ్ కోచ్ బి. ఈశ్వరరావు, సభ్యులు ఎస్ఈ రాజు, డి.మురళి, బి.జగదీష్, వి.సంతోష్‌కుమార్, పి.శ్రీనివాసరావు, బి.ప్రసాద్‌లు ఉన్నారు.

గ్రామీణులకు మెరుగైన వైద్యసేవలు అందించాలి

- డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ రమణకుమారి



మాట్లాడుతున్న డీఎంహెచ్‌ఓ రమణకుమారి

విజయనగరం ఫోర్ట్: గ్రామీణ ప్రాంత ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎస్వీ రమణకుమారి సూచించారు. ఈ మేరకు స్థానిక జిల్లా వైద్య ఆరోగ్యశాఖ కార్యాలయంలో మిడ్ లెవెల్ హెల్త్ ప్రొవైడర్స్ (ఎంఎల్‌హెచ్‌పీ)కు బేసిక్ లైఫ్ సపోర్టుపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆమె పాల్గొని మాట్లాడుతూ విలేజ్ హెల్త్ క్లినిక్‌లకు వచ్చే వారికి సకాలంలో వైద్యం అందిస్తే మరణాల సంఖ్యను తగ్గించవచ్చన్నారు. పాము కాటు బాధితులు, అత్యవసర స్థితిలో ఆస్పత్రికి వచ్చిన వారికి ఏవిధమైన చికిత్స అందించాలనే దానిపై శిక్షణ ఇవ్వాలని తెలిపారు. సమయ పాలన కచ్చితంగా పాటించాలని స్పష్టం చేశారు. విధుల పట్ల నిర్లక్ష్యం వహించరాదని హెచ్చరించారు.

హత్య కేసులో ముద్దాయికి యావజ్జీవం

విజయనగరం లీగల్/కొత్తవలస: భార్యను శారీరకంగా, మానసికంగా వేధించి హతమార్చాడన్న ఆరోపణ రుజువు కావడంతో కొత్తవలస మండలం కొత్తూరు గ్రామానికి చెందిన ఇనుపచప్ప చింతాలుకు జీవిత ఖైదుతో పాటు రూ.5వేలు జరిమానా విధిస్తూ మూడవ జిల్లా అదనపు జడ్జి మీనాదేవి సోమవారం తీర్పు చెప్పారు. ఈ కేసుకు సంబంధించి అదనపు పబ్లిక్‌ప్రాసిక్యూటర్ మరువాడ రవీంద్రనాథ్ అందించిన వివరాలిలా ఉన్నాయి. నిందితుడు చింతాల్..భార్య దుర్గమ్మను ప్రతి చిన్న విషయానికి అనుమానించసాగాడు. ఈ విషయంలో వారు తరచూ తగువులు పడుతుండే వారు. ఆమెపై కక్ష పెంచుకుని మానసికంగా, శారీరకంగా వేధించసాగాడు. సుమారు రెండేళ్ల క్రితం చింతాల్ భార్యను హతమార్చాడు. ఈ మేరకు కొత్తవలస సీఐ బాలసూర్యారావు కేసు నమోదు చేసి నిందితుడు చింతాల్‌ను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. ప్రాసిక్యూషన్ సరైన ఆధారాలతో కేసు రుజువు చేయడంతో న్యాయమూర్తి పై విధంగా తీర్పు చెప్పారు.

వేధింపుల కేసు నమోదు

పాచిపెంట: అదనపు కట్నం కోసం వేధిస్తున్న భర్త, అత్త, ఆడపడుచులపై వేధింపుల కేసు నమోదు చేసినట్లు పాచిపెంట ఎస్సై వెంకటరమణ సోమవారం తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. దత్తిరాజేరు మండలం దత్తిరాజేరు గ్రామానికి చెందిన బగ్గ గౌరీ శంకరరావుతో పాచిపెంట మండలం పాంచాలి గ్రామానికి చెందిన గౌరికి 2019లో వివాహమైంది. వారికి గత ఏడాది పాప పుట్టి మరణించింది. అప్పటినుంచి గౌరీశంకరరావు రోజు మద్యం తాగి వచ్చి భార్యతో గొడవ పడుతూ ఉండేవాడు, అంతేకాకుండా గౌరిని భర్తతో పాటు అత్త రాములమ్మ, ఆడపడుచు పైడిరాజు అదనపు కట్నం రూ.రెండు లక్షలు కావాలని వేధింపులకు గురి చేసే వారు. ఈ మేరకు బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్సై పేర్కొన్నారు.

నలుగురు నిందితుల అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న టూటౌన్ సిఐ సిహెచ్.లక్ష్మణరావు

విజయనగరం క్రైమ్: మోటార్ బైక్‌ల విడిభాగాల చోరీకి పాల్పడుతున్న నలుగురు నిందితులను టూటౌన్ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. ఈ మేరకు సీఐ సీహెచ్.లక్ష్మణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇంటి ముందు పార్క్ చేసిన పాత మోటార్ సైకిల్స్‌ను కుప్పకుమార్, చోడి జగదీష్, హంస శ్రీను, వంక రాజులు చోరీ చేసి విడిభాగాలుగా చేసి స్క్రాప్ షాప్‌లకు కమ్మవీధికి చెందిన ఇనుప సామగ్రి కొనే గెద్ద పైడిరాజుకు అమ్మారు. బాధితుల ఫిర్యాదు మేరకు విచారణలో భాగంగా మరికొన్ని వాహనాలను ఈ నలుగురు నిందితులు దొంగలించినట్లు, వాటిని పైడిరాజుకు అమ్ముతున్నట్లు తెలిసింది. ఈ కేసుకు సంబంధించి మరో నిందితుడు పరారీలో ఉన్నాడు. కేసులో చాకచక్యంగా వ్యవహరించి నిందితులను పట్టుకోవడంలో కీలకపాత్ర పోషించిన ఏఎస్సై పైడితల్లి, కానిస్టేబుల్ వాసు, ఇస్మాయిల్‌ను సీఐ అభినందించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

- మరో ముగ్గురికి గాయాలు



మృతుడు గణేష్



సంఘటనా స్థలం వద్ద బైక్, ట్రాక్టర్ తొట్టి

బొబ్బిలి: విధి వక్రించడమంటే ఇదే. రోడ్డుప్రమాదంతో ట్రాఫిక్‌ను క్లియర్ చేస్తుండగా సంఘటనా స్థలంలోనే మరో రోడ్డు ప్రమాదం చోటు చేసుకుని ఎంతో భవిష్యత్తున్న యువకుడు మృతి చెందగా మరో ముగ్గురికి గాయాలయ్యాయి. సీఐ ఎం.నాగేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని అలజంగికి చెందిన ఓ ట్రాక్టర్ పిక్కరాయితో వెళ్తుండగా గ్రోత్ సెంటర్, పట్టణం మధ్యలోని పోలవాని వలస వద్ద టైర్ పంక్చరయింది. దీంతో డ్రైవర్ తొట్టెను రోడ్డు పక్కగా ఉంచి, పంక్చర్ వేయించి తీసుకెళ్లొచ్చని ఇంజిన్‌ను తీసుకుని వెళ్లిపోయాడు. ఈ తొట్టెను గమనించని పార్వతీపురం మన్యం జిల్లా బలిజిపేట మండలం చిలకల పల్లికి చెందిన టాటా ఏస్ వాహనం ఢీకొంది. ఈ వాహనంలో ప్రయాణిస్తున్న చిలకపల్లికి చెందిన బోనెల సాంబయ్య కాలు విరిగిపోయింది. అతనిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. సంఘటనాస్థలంలో టాటా ఏస్, ట్రాక్టర్ తొట్టె ఉండిపోవడంతో ట్రాఫిక్ క్లియర్ చేసే పనిలో పోలీసులు నిమగ్నమయ్యారు. ఓ క్రేన్‌ను తీసుకువచ్చి వాహనాలను రోడ్డుపక్కకు లాగే ప్రయత్నంలో ఉండగా పట్టణానికి చెందిన ముగ్గురు యువకులు బైక్‌పై స్పీడ్‌గా వచ్చి తొట్టె, టాటా ఏస్‌ల మధ్య బలంగా ఢీకొన్నారు. క్షతగాత్రులను పోలీసులు తమ వాహనాల్లోనే ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో టాటా ఏస్ నడుపుతున్న పట్టణంలోని నాయుడు కాలనీకి చెందిన కోట్ల గణేష్(23) అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మరో ఇద్దరిలో ఇందిరమ్మ కాలనీకి చెందిన బూర్లి చిన్నారావు తీవ్ర గాయాలపాలవగా విజయనగరం కేంద్రాస్పత్రికి తరలించారు. టి.సురేష్ స్వల్ప గాయాలతో బయటపడగా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని పోలీసులు తెలిపారు. కాగా మృతి చెందిన యువకుడు గణేష్ తండ్రి కోట్ల శ్రీనివాసరావు విశాఖ ప్రభుత్వ ఐటీఐలో ఇన్‌స్ట్రక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఐటీఐ, డిగ్రీ పూర్తి చేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా ఈ దుర్ఘటన జరగడంతో కుటుంబసభ్యులు తీవ్ర విషాదంలో మునిగిపోయారు.

బైక్, కారు ఢీ: ఇద్దరికి గాయాలు



గంట్యాడ: కొర్లాం వద్ద ప్రమాద దృశ్యం

గంట్యాడ: పూసపాటి రేగ మండలానికి చెందిన నూకరాజు, రాజు ఆదివారం రాత్రి 10 గంటల సమయంలో అరకు నుంచి బైక్‌పై స్వగ్రామానికి వెళ్తుండగా కొర్లాం జంక్షన్‌లో గంట్యాడ నుంచి వస్తున్న కారు బలంగా ఢీకొట్టడంతో ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి. వారిని స్థానికులు విజయనగరంలోని ఓ ఆస్పత్రిలో చేర్పించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్సై కె.కిరణ్‌కుమార్ నాయుడు తెలిపారు.

లారీ ఢీకొని ఇద్దరికి..



పార్వతీపురం: చికిత్స పొందుతున్న రుత్విక్

పార్వతీపురం: పార్వతీపురం మండలం వెంకంపేట పంచాయతీ వసుంధర నగర్‌కు చెందిన బగ్గాం వెంకటరమణ, మనుమడు రుత్విక్ పార్వతీపురంలోని రిలయన్స్ షాపునుంచి ద్విచక్రవాహనంపై వారి ఇంటికి వస్తుండగా గెడ్డవీధి సమీపంలో వెనుకనుంచి లారీ ఢీ కొంది. ఈ ఘటనలో ఇద్దరూ అక్కడికక్కడే కింద పడి గాయాలపాలయ్యారు. ఈ మేరకు చికిత్సకోసం వారిని పార్వతీపురం జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ట్రాక్టర్ ఢీకొని వ్యక్తికి..

పాచిపెంట: మండల కేంద్రానికి చెందిన మద్ది రవీంద్ర ద్విచక్ర వాహనంపై సాలూరు వెళ్తుండగా సాలూరు నుంచి వస్తున్న ట్రాక్టర్ కర్రివలస సమీపంలో ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో రవీంద్రకు తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే 108 సహాయంతో సాలూరు సీహెచ్‌సీకి తరలించారు. దీనిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వెంకటరమణ పేర్కొన్నారు.